క్లుప్తంగా...

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు



బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఇంద్రారెడ్డి వీకర్ కాలనీ బస్తీలో శ్రీ సరస్వతీ విద్యాపీఠం ప్రాంత సేవా విభాగం ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలను నిర్వహించారు. జంపాల నర్సింహ్మా సేవా సమితి సౌజన్యంతో దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ పోటీలను శ్రీ సరస్వతీ విద్యాపీఠం భాగ్యనగర్ విభాగ్ సేవా ప్రముఖ్ భల్లా మలేల్ష్, జంపాల నర్సింహ్మా సేవా సమితి అధ్యక్షులు జంపాల నర్సింహ్మా ప్రారంభించారు.

మహిళ అదృశ్యం



అమృత (ఫైల్)

శంషాబాద్ రూరల్: ఆసుపత్రికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి మహిళ అదృశ్యమైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దగోల్కొండలో నివసిస్తున్న నెల్లీ బాల్‌రాజ్, అమృత(23) దంపతులు స్థానికంగా ఉన్న నర్సరీలో పనిచేస్తున్నారు. ఈనెల 20న అమృత తనకు జ్వరం వచ్చిందని శంషాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి కుమారుడితో పాటు వెళ్లి తిరిగి రాలేదు. శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి కుమారుడు శివప్రసాద్ ఇంటి వద్ద వదిలి వెళ్లారు. తల్లి గురించి కొడుకు భయంతో వివరాలు చెప్పడంలేదు. దీంతో భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉమ్రా యాత్రికులకు ఘనస్వాగతం



శంషాబాద్: ఇరవై రోజుల కిందట ఉమ్రా యాత్రకు వెళ్లి యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకుని తిరిగి వచ్చిన వారికి శంషాబాద్ విమానాశ్రయంలో శనివారం ఘనంగా స్వాగతం పలికారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాట రాష్ట్రాలకు చెందిన యాత్రికులకు వారి కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు పుష్పగుచ్చాలు, శాలువాలు వేసి స్వాగతం పలికారు.

ఇంద్రాసేనా రెడ్డికి సన్మానం



రాజేంద్రనగర్: త్రిపురా గవర్నర్‌గా నియమితులైన నల్లు ఇంద్రాసేనా రెడ్డిని శనివారం రాష్ట్ర బీజేపీ యువ మోర్చా నాయకుడు బొక్క బాల్‌రెడ్డి శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డి మాట్లాడుతూ... మలక్‌పేట్ నియోజకవర్గం హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా ఇంద్రాసేనా రెడ్డి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు.

దసరాకు ఊరెళ్తున్నారా.. ఇల్లు జర భద్రం

నార్సింగి ఇన్‌స్పెక్టర్ శివకుమార్

మణికొండ: దసరా సందర్భంగా సొంతూరికి వెళ్లేటపుడు ఇంటి గురించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు పేర్కొంటున్నారు. ఇంటి వద్ద తగు జాగ్రత్తలు తీసుకోవటంతో పాటు పోలీసులకు సమాచారం ఇవ్వాలని నార్సింగి ఇన్‌స్పెక్టర్ వి.శివకుమార్ సూచించారు. ఆయన శనివారం 'సాక్షి'తో మాట్లాడుతూ గ్రామాలకు వెళ్లేవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగకు అందరూ గ్రామాలకు వెళ్లటంతో తాళం కనిపించిన గృహాలలో చోరీలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. రాత్రి సమయంలో గస్తీలను పెంచి తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని, ప్రజలు సైతం తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని పేర్కొన్నారు. ఇప్పటికే పలు రోడ్లు, కాలనీలలో సీసీ టీవీలను ఏర్పాటు చేయటంతో వాటి ద్వారా పోలీస్‌స్టేషన్‌ల నుంచే పర్యవేక్షణ సైతం చేస్తామన్నారు. ప్రజలు తీసుకోవాల్సిన మరిన్ని జాగ్రత్తలను ఆయన ఇలా వివరించారు.



నార్సింగి ఇన్‌స్పెక్టర్ శివకుమార్

- ప్రజలు మిగిలి ఉన్న కాలనీలు, ఇళ్లు, పరిసరాలు, షాపులలో సీసీ కెమరాలను ఏర్పాటు చేసుకోవాలి.
- ఊరికి వెళ్లే వారు తమ ఇంటి పరిసరాలను గమనించాలని పక్కింటి వారికి చెప్పాలి.
- విలువైన వస్తువులను బైక్‌లు, కార్లలో పెట్టవద్దని, వాటిని రోడ్లపై కాకుండ ఇంటి ఆవరణలోనే పార్కింగ్ చేయాలి. వాటికి హాండిల్ లాక్‌తో పాటు వీల్ లాక్‌లు వేయాలి.
- బీరువా తాళం చెవులను ఇంట్లో ఉంచవద్దని, తమతో పాటే తీసుకెళ్లాలి. పాలు, పేపర్ వారిని రావద్దని చెప్పాలి. పనిమనుషులు ఉంటే రోజూ వాకిలి ఊడ్చమని చెప్పాలి.
- ఇంటికి తాళం వేసి అది కనిపించకుండా డోర్ కర్టెన్‌ను అడ్డుగా ఉంచటంతో పాటు ఇంట్లో ఒక లైటును వేసి ఉంచాలి. వీలుంటే టైమర్‌తో కూడిన లైట్లను అమర్చుకోవాలి.
- విలువైన వస్తువులు, వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పకూడదు. బంగారం, నగదును లాకర్‌లలో భద్రపర్చుకోవాలి.
- తమ ఇంటి చిరునామా, ఫోన్ నెంబర్‌లను పోలీస్‌స్టేషన్‌లో తెలపాలి. అలాంటి చోట్ల గస్తీ పెంచుతాం. ఇళ్లు, అపార్ట్‌మెంట్‌ల ముందుకు ఎవరైనా కొత్త వారు వస్తే వారి వివరాలను వాచ్‌మెన్‌లను పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని తెలపాలి.
- నమ్మకమైన వాచ్‌మెన్‌లు, సెక్యూరిటీ గార్డులనే నియమించుకోవాలి. వారి పూర్తి వివరాలను తీసుకోవాలి.
- సీసీ కెమరాలు ఉన్నవారు తమ సెల్ ఫోన్‌లలో అపుడపుడు తమ ఇంటి పరిసరాలను చూసుకోవాలి.

పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేసిన డిప్యూటీ మేయర్



బండ్లగూడ: పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివని వారు విధులు నిర్వహించే సమయంలో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్‌లో పారిశుద్ధ్య కార్మికులకు ఆయన దసరా పండుగ సందర్భంగా సొంత ఖర్చుతో చీరలు, నగదును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ నుంచి అవకాశం కల్పించాలి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌టీపీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని కోరుతూ సొంటిరెడ్డి రాఘవ రెడ్డి శనివారం వైఎస్సార్ తెలంగాణ పార్టీ కార్యాలయంలో దరఖాస్తు ఫారాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కొలన్ రాంరెడ్డి, సదాల శ్రీనివాస్ రెడ్డి, జగదీశ్, దశరథ్, అనిల్, పృథ్వీ, సైఫ్ తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తు అందజేస్తున్న సొంటిరెడ్డి రాఘవ రెడ్డి



ఎంజీ పార్కులో..



అలకాపూర్‌లో..

సరదాగా.. సందడిగా

పలుచోట్ల ఉత్సాహంగా బతుకమ్మ వేడుకలు

రాజేంద్రనగర్ నియోజకవర్గంలో శనివారం బతుకమ్మ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. పలు చోట్ల నాయకులు, ప్రజాప్రతినిధులు వేడుకల్లో పాల్గొన్నారు. ప్రభుత్వ కార్యాయలయాల్లో ఉద్యోగులు వేడుకలు నిర్వహించారు. స్థానిక మహిళలు రంగు రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. స్థానికంగా ఉన్న కొలనుల్లో నిమజ్జనం చేశారు.



మణికొండ క్వార్టర్స్‌లో..



ఉత్సవాల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు



మణికొండ పోచమ్మ దేవాలయంలో



మణికొండ గార్డన్స్‌లో..

బతుకమ్మను ఘనంగా జరుపుకోవాలి

మణికొండ: దసరా పండగ సందర్భంగా మహిళలు ఆడి, పాడే బతుకమ్మ ఉత్సవాలను సంతోషంగా ఘనంగా జరుపుకోవాలని నార్సింగి కౌన్సిలర్ పత్తి శ్రీకాంత్‌రావు అన్నారు. శనివారం ఆయన బతుకమ్మ ఆడేందుకు అనుగుణంగా ముష్కి చెరువు పక్కన చదును చే సి, ఏర్పాట్లను మొదలు పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన పండగలు సంస్కృతి, సాంప్రదాయాలతో పాటు పర్యావరణం, పకృతికి పెద్దపీట వేసి నిర్వహించుకోవటం గర్వకారణమన్నారు. అలాంటి వాటిని భవిష్యత్తు తరాలకు అందించేలా పెద్ద ఎత్తున నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామన్నారు.బతుకమ్మలతో చెరువు వద్దకు వచ్చే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వీది దీపాలు, తాగునీరు తదితర సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సానిటేషన్ ఇంచార్జి లచ్చిరాం పాల్గొన్నారు.



నార్సింగి ముష్కి చెరువు వద్ద బతుకమ్మ ఏర్పాట్లు చేయిస్తున్న కౌన్సిలర్ శ్రీకాంత్‌రావు

పోలీస్‌స్టేషన్‌లో..



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో కానిస్టేబుళ్లు, రైటర్లు అందరూ కలిసి బతుకమ్మ ఆట పాటలతో ఘనంగా నిర్వహించుకున్నారు. బతుకమ్మ ఆటపాటలతో పాటు తనతో పాటు పని చేస్తున్న వారంతా క్షేమంగా ఉండాలంటూ భగవంతున్ని కోరుకుంటున్నామంటూ మహిళా సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఏసీపీ గంగాధర్, రాజేంద్రనగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర బాబు, రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మకు ఘాట్ సిద్ధం



శంషాబాద్: శంషాబాద్ పట్టణంలో ఆదివారం సాయంత్రం జరిగే సద్దుల బతుకమ్మ వేడుకలకు కాముని చెరువు ఘాట్ సిద్ధమైంది. గత పదిరోజులుగా చేపడుతున్న పనులు పూర్తయ్యాయి. బతుకమ్మలను భద్రంగా జారవిడిచేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. సద్దుల బతుకమ్మ వేడుకలను సంతోషంగా నిర్వహించుకోవాలని మున్సిపల చైర్‌పర్సన్ సుష్మ సూచించారు.

సద్దుల బతుకమ్మ నిమజ్జనం ఏర్పాట్ల పరిశీలన



అత్తాపూర్: దసరా దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా హైదర్‌గూడలో బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం సద్దుల బతుకమ్మల నిమజ్జనం సందర్భంగా శనివారం శ్రీ ప్రణవ భక్త సమాజం అధ్యక్షులు మొండ్రా నర్సింహా, ఉపాధ్యక్షులు బర్ల మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శులు పుస్తకాల అశోక్, కార్యదర్శి కొడమీది హరినాథ్, ముఖ్య సలహదారులు పరిశీలించారు.

హెచ్‌సీయూలో శ్రమదానం

రాయదుర్గం: వీకెండ్స్‌లో విద్యార్థులంతా కలిసి శ్రమదానం, క్లీనప్ డ్రైవ్‌లో పాల్గొన్నారు. హెచ్‌సీయూలో ఎన్‌ఎస్‌ఎస్, హెచ్‌సీయూ సెల్ ఆధ్వర్యంలో హార్టికల్చర్, శానిటేషన్ విభాగాల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నిత్యం కంప్యూటర్లు, పుస్తకాలతో కుస్తీలు పడే విద్యార్థులు వీకెండ్‌లో శనివారం ఉదయం పలుగుపార చేతపట్టడమే కాకుండా భారీచెట్ల కొమ్మలను సైతం తొలగించి వాటిని డంపింగ్ యార్డుకు తరలించారు. గచ్చిబౌలి హెచ్‌సీయూలోని 'స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్' ప్రాంగణంలో చెట్ల నుంచి వేరుపడిన కొమ్మలు, ఇతర వ్యర్థాలను తొలగించారు. చెట్ల నుంచి గాలికి రాలి పడిపోయిన పొడి ఆకులు, ఇతర వ్యర్థాలను ఏరి వాటిని ట్రాక్టర్లతో డంపింగ్ యార్డుకు తరలించారు. ఎన్‌ఎస్‌ఎస్, హెచ్‌సీయూ కో– ఆర్డినేటర్ డాక్టర్ కృష్ణయ్య, వాలంటీర్లు, విద్యార్థులు అజయ్‌ప్రకాష్, వెంకటేష్, నితిన్, ముస్తఫా, రిషబ్‌శర్మ, యోగేంద్రప్రతాప్‌సింగ్, అనీస్ అహ్మద్, కుసుమ, మనీషా, దివ్య ధనేశన్, ప్రతాప్ తదితరులున్నారు.

చిన్నారులకు నోట్ పుస్తకాల పంపిణీ



బండ్లగూడ: ప్రజలంతా దైవ చింతనతో ఉన్నప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్ దేవీ శరన్నవ రాత్రి మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పిల్లలకు నోటు పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు.



మణికొండ ఓయూ కాలనీలో..



మణికొండ క్వార్టర్స్‌లో..



ఎంప్లాయిస్ కాలనీలో..

ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి



కిస్మత్‌పూర్‌లో పూజలు చేస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దేవీ శరన్నవ రాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. కాళీమందిర్, కిస్మత్‌పూర్ తదితర ప్రాంతాలలో ప్రతిష్టించి దుర్గామాతకు జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.



దుర్గాదేవి అలంకారంలో మణికొండ ఓయూకాలనీ అమ్మవారు



ఖానాపూర్‌లో..

దుర్గాదేవిగా అమ్మవారు

మణికొండ: దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం అమ్మవారు దుర్గాదేవిగా దర్శనం ఇచ్చారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో మణికొండ, పుప్పాలగూడ, నెక్నాంపూర్, నార్సింగి, మంచిరేవుల, కోకాపేట, గండిపేట, ఖానాపూర్, వట్టినాగులపల్లి, గొలిదొడ్డి గ్రామాలలో నవరాత్రులలో బాగంగా ఏడవ రోజు శనివారం అమ్మవారికి ఘనంగా పూజలు చేశారు. మణికొండ ఓయూ కాలనీలోని దుర్గామాత, సెక్రటేరియట్ కాలనీలోని శ్రీ శారద, పంచవటి కాలనీలోని శ్రీలలితా కామేశ్వరస్వామి, మణికొండ పార్వతీరామలింగేశ్వరస్వామి, పుప్పాలగూడ శ్రీకాశీ అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి దేవాలయాలలో ఉదయం దర్శనాలు, సాయంత్రం కుంకుమార్చనలను నిర్వహిస్తున్నారు. మణికొండ ఓయు కాలనీ దుర్గామాత దేవాలయంలో శనివారం సరస్వతీ, బాల్‌రెడ్డి దంపతులు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. పలు మండపాలలో ప్రజాప్రతినిధులు, నాయకులు అమ్మవార్లను దర్శనం చేసుకున్నారు.

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

శంషాబాద్ రూరల్: దసరా ఉత్సవాల్లో భాగంగా శరన్నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. కవ్వగూడలో దుర్గామాతకు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్థానికులు కె.బాలు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచు రమేష్, ఉపసర్పంచు పద్మావతి, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



కవ్వగూడలో పూజలు నిర్వహిస్తున్న స్థానికులు

కరెన్సీ నోట్లతో అమ్మవారికి అలంకారం

అత్తాపూర్: రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్‌గూడ శ్రీ పబ్బతి వీరాంజనేయ స్వామి దేవాలయంలో కొలువుదీరిన అమ్మవారిని లక్ష్మీదేవి రూపంలో అలకరించారు. ప్రతిఏటా అలంకరణలో భాగంగా 100 మంది యువకులు, మహిళలు సంవత్సరం పొడవునా జమ చేసుకున్న డబ్బుతో అమ్మవారిని అలంకరించడం ఇక్కడ ఆనవాయితీ. ఇందులో భాగంగా ఈ సంవత్సరం రూ.25 లక్షల రూపాయల నోట్లతో అమ్మవారిని అలంకరించారు. అనంతరం నిర్వహించిన అన్నదానంలో గ్రామస్తులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రూ.25 లక్షలతో లక్ష్మీదేవి రూపంలో కొలువుదీరిన అమ్మవారి పూజల్లో పాల్గొన్న భక్తులు

ఘనంగా దుర్గామాత పూజలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ కార్యాలయంలో దుర్గామాత పూజలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ పూజ కార్యక్రమంలో రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎల్.గోపయ్య, డివిజనల్ ఇంజనీర్ పి.రత్నాకర్ రావు, కన్‌స్ట్రక్షన్ డీఈ చంద్రోశేఖర్, అకౌంట్స్ ఆఫీసర్ హరీష్ చంద్రోశేఖర్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ గోపి నాగమణి, అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్లు ఈశ్వర్ ప్రసాద్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

